అతిపెద్ద ఇండస్ట్రియల్ క్లస్టర్‌గా కొప్పర్తి

● జిల్లా ఇన్‌చార్జి అధికారి సౌరభ్ గౌర్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి, రాష్ట్ర కమిషనర్ సౌరభ్ గౌర్, కలెక్టర్ శ్రీధర్‌లు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ రానున్న 10 సంవత్సరాలలో అతిపెద్ద ఇండస్ట్రియల్ క్లస్టర్‌గా అభివృద్ధి చెందుతుందని, అందుకు తగ్గ వనరులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని జిల్లా ఇన్‌చార్జి అధికారి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్, జేసీ అదితిసింగ్‌లతో కలసి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి అధికారి మాట్లాడుతూ కొప్పర్తిలో సీసీ కెమెరాలు, ఎలక్ట్రిక్ స్మార్ట్‌మీటర్లు, టెలికాం కేబుల్స్‌తో పాటు టెలివిజన్ మాన్యుఫ్యాక్చర్ కంపెనీలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అందుకు సంబంధించిన కంపెనీలతో మాట్లాడి డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో ఆధునాతన వసతులతో స్టార్టప్ సెంటర్ భవన నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక రంగాలతో పాటు రానున్న ఐదేళ్లలో జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం మీనాపురం గ్రామ పొలాల్లో బుధవారం సాయంత్రం పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందారు. పోలీసుల, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మీనాపురం గ్రామానికి చెందిన చిట్టిబోయిన మునిస్వామి (44), లక్ష్మిదేవి దంపతులకు పవన్‌కుమార్, తేజాయాదవ్ కుమారులు. మునిస్వామి సొంత ట్రాక్టరుతో బాడుగులకు పోతుంటాడు. వీరికి పశువులు ఉన్నాయి. వాటికి వరిచెత్త మేతను తెచ్చేందుకు మునిస్వామి బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లగా ఇంతలోనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. ఉన్నఫలంగా పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు హుటాహుటిన ఆయనను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మునిస్వామి తన పెద్ద కుమారుడు పవన్‌కుమార్‌కు చెల్లెలి కూతురుతో ఈ నెల 12వ తేదీన వివాహం జరిపించారు. కుమారుడి పెళ్లిసందడి ఇంటిలో కొన సాగుతోంది. అంతలోనే పిడుగుపాటుతో ఇంటిపెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన చిట్టిబోయిన మునిస్వామి

ఉక్కుపై చిగురిస్తున్న ఆశలు

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కడప జిల్లా వాసుల చిరకాల వాంఛ. దీనికి దివంగత సీఎం వైఎస్ హయాంలో బ్రాహ్మణి స్టీలు ఫ్యాక్టరీతో అంకురార్పణ జరిగింది. ఆయన మరణంతో అది ఆగిపోయింది. సీఎం చంద్రబాబునాయుడు 2018 డిసెంబరు 27న మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద శంకుస్థాపన చేశారు. 2019లో జగన్ సీఎం కావడంతో చంద్రబాబు శంకుస్థాపన చేసిన చోట కాకుండా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద అదే ఏడాది డిసెంబరు 23న ఏపీ హైగ్రేడ్ స్టీలు ఫ్యాక్టరీ పేరుతో శంకుస్థాపన చేశారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే లోపు రెండోసారి కూడా శంకుస్థాపన చేశారే కానీ నిర్మాణం చేపట్టలేదు. ఇప్పుడు చంద్రబాబు స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తామని ఇటీవల జరిగిన టెలీ కాన్ఫరెన్స్‌లో టీడీపీ నేతలతో చెప్పారు. దీంతో జిల్లా వాసుల్లో మళ్లీ ఉక్కుఫ్యాక్టరీపై ఆశలు చిగురిస్తున్నాయి.

● టెలీ కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు హామీ



27 డిసెంబరు 2018న మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామంలో ఉక్కు ఫ్యాక్టరీకోసం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన పైలాన్ (ఫైల్‌ఫొటో)

(కడప-ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం వస్తే జిల్లా రూపురేఖలే మారిపోతాయనే భావన జనాల్లో మెండుగా ఉంది. అందుకే దాదాపు రెండు దశాబ్దాలుగా దీనికోసం ఎదురు చూస్తున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో బ్రాహ్మణి స్టీలు ఫ్యాక్టరీకి శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మరణం, గాలి రాజశేఖర్‌రెడ్డి కేసుల్లో ఇరుక్కోవడంతో బ్రాహ్మణి స్టీల్స్ ఆగిపోయింది. 2018 డిసెంబరులో సీఎం చంద్రబాబునాయుడు మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. 2019లో అధికారం మారడంతో ఇదీ ఆగిపోయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబరులో జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద ఏపీ హైగ్రేడ్ స్టీల్ ఫ్యాక్టరీ పేరిట శంకుస్థాపన చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా ఈ స్టీలు ఫ్యాక్టరీకి సీఎం హోదాలో జగన్ రెండోసారి శంకుస్థాపన చేశారే కానీ.. నిర్మాణం మాత్రం పూర్తి చేయలేదు. మొదటిసారి స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకూ వరుసగా కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ముందడుగు పడలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఇంకా స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణానికి అడుగులు పడకపోవడం గమనార్హం. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ప్రధాని మోదీ పర్యటనపై టీడీపీ నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రాబోవు రోజుల్లో చేపట్టనున్న పలు ప్రాజెక్టుల నిర్మాణం విషయం వచ్చినప్పుడు కడప స్టీలు ఫ్యాక్టరీపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. వైజాగ్ స్టీలు ప్లాంటును ప్రైవేటు పరం కాకుండా ఆదుకోవడంతో పాటు ఉత్తరాంధ్రలో మరో స్టీలు ప్లాంటు ఏర్పాటు చేయనున్నామని, త్వరలోనే కర్నూలులో చేపట్టబోయే పలు పరిశ్రమలకు ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయిస్తామని వివరించారు. ఇక కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కూడా చేపడతామని చంద్రబాబు ప్రకటించడంతో మళ్లీ జిల్లా వాసుల్లో ఆశలు చిగురించాయి.

సీఎం రమేశ్ నిరశన దీక్షతో..

విభజన చట్టంలో భాగంగా కడపలో స్టీలుప్లాంటు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అయితే ఇది సాధ్యం కాదని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో అప్పటి రాజ్యసభ సభ్యుడు, ప్రస్తుతం బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ స్టీల్ ఫ్యాక్టరీకోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అయినా కేంద్రంలో కదలిక లేకపోవడంతో స్టీల్ ఫ్యాక్టరీ రాష్ట్ర ప్రభుత్వం తరఫునే ఏర్పాటు చేస్తామని అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి సీఎం రమేశ్‌తో దీక్ష విరమింప చేశారు. ఆ మేరకు 2018 డిసెంబరు 27న మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద స్టీలు ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. 2019లో అధికారం మారడంతో జగన్‌మోహన్‌రెడ్డి జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద రెండుసార్లు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు విభజిత రాష్ట్రానికి చంద్రబాబు రెండోసారి సీఎం అయ్యారు. అప్పట్లో ఉక్కుఫ్యాక్టరీకోసం దీక్ష చేసిన సీఎం రమేశ్ ప్రస్తుతం బీజేపీ నుంచి ఎంపీగా ఉన్నారు. ప్రస్తుత కేంద్రప్రభుత్వం ఏర్పాటులో సీఎం చంద్రబాబు నాయుడు భాగస్వామ్యమూ ఉంది. ఈ నేపథ్యంలో ఉక్కుఫ్యాక్టరీ ఈ పర్యాయం సాకారం అవుతుందని జిల్లా ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. అయితే నాడు చంద్రబాబు శిలాఫలకం ఆవిష్కరించిన కంబాలదిన్నె వద్దా.. లేక జగన్ ఆవిష్కరించిన సున్నపురాళ్ల వద్ద ఏర్పాటు చేస్తారా అనే ఆసక్తి జిల్లా ప్రజల్లో నెలకొంది.

ప్రభుత్వ ఖజానాకు రూ.25 లక్షలు

● మైనింగ్ శాఖ అనుమతితో తిరిగి తవ్వకాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దువ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం సమీపంలోని గుట్టల్లో మైనింగ్ శాఖ అనుమతితో బుధవారం గ్రావెల్ తవ్వకాలు మొదలు పెట్టారు. ఇంతకు మునుపు ఈ ప్రాంతంలోని పలుచోట్ల అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు గ్రావెల్ నింపి అక్రమంగా తరలించేవారు. ఈ విషయాన్ని ఫిబ్రవరి 18న 'కూటమి సర్కార్‌లోనూ కొల్లగొడుతున్నారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు అక్రమ తవ్వకాలు అడ్డుకుని వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించారు. అప్పటి నుంచి ఇక్కడ తవ్వకాలు నిలిపివేశారు. మైదుకూరు ప్రాంతంలో జరుగుతున్న హైవే పనుల కోసం తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో గ్రావెల్ నాణ్యతగా ఉండడంతో ఇక్కడే మట్టి తవ్వకాలకు అనుమతి కోరారు. ఈ మేరకు రూ.25,14,200 రాయల్టీ చెల్లించి మైనింగ్ శాఖ అనుమతి పొందారని దువ్వూరు తహశీల్దారు అక్బల్ బాషా తెలిపారు. పై అధికారుల ఆదేశాల అధికారుల మేరకు అనుమతులు ఇచ్చామని ఆయన వెల్లడించారు. సర్వే నంబరు 139/1ఎ2లో అనుమతులు ఇచ్చామన్నారు. రోడ్డు వేస్తున్నవారికి అనుమతి మించి గ్రావెల్ అవసరం అయితే తిరిగి మైనింగ్ శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని తెలిపారు.



కూటమి సర్కారులోనూ..
కొల్లగొడుతున్నారు..!

ఫిబ్రవరి 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం (ఫైల్‌ఫొటో)



చోరీ జరిగిన ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ చలపతి

రాయచోటిలో దొంగల హల్‌చల్

● పట్టపగలే చోరీ
● రూ.50 లక్షల విలువ గల 50 తులాల బంగారు నగలు అపహరణ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో పలుచోట్ల దొంగలు హల్‌చల్ చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో విజయభాస్కర్ అనే వ్యక్తి ఇంటిలో రూ.50 లక్షల విలువ గల 50 తులాల బంగారు నగలను దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు... రాజు స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న విజయభాస్కర్ తన కుమార్తెతో కలిసి కంటికి వైద్య పరీక్షల కోసం బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి 11.30 గంటలకు రాగా డోర్ పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూస్తే వస్తులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న 50 తులాల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా ఇంటిలోని వెండి వస్తువులను దొంగలు అక్కడే పడేశారు. ఈ మేరకు అర్బన్ సీఐ వెంకటచలపతి, ఎస్ఐ జహీర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మంగళవారం రాత్రి రాయచోటి పట్టణంలోని బస్టాండు నుంచి బంగ్లా రోడ్డు వద్దకు వెళ్లే దారిలోని కృష్ణ సెల్ పాయింట్‌లో రూ.40వేలు చోరీ చేశారు. బుధవారం ఉదయం షాపు యజమాని రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేగాక మంగళవారం రాత్రి దొంగలు కృష్ణ సెల్ పాయింట్‌కు పక్కన ఉన్న హోటళ్లల్లో కూడా దొంగతనానికి ప్రయత్నించినట్లు సమాచారం. ఇటీవల పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేసినప్పటికీ దొంగలు ఏదో ఒకచోట దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నారు. బస్టాండుకు ప్రధాన రహదారిలో ఉన్న కృష్ణ సెల్ పాయింట్ దొంగతనం జరగడంతో మిగిలిన షాపుల యజమానులు భయాందోళనలకు గురవుతున్నారు.

స్టడీ సర్టిఫికెట్ల కోసం...

● డీఎస్సీ అభ్యర్థులు సతమతం 7
● స్కూళ్లకు వేసవి సెలవులు
● అందుబాటులో లేని ప్రధానోపాధ్యాయులు
● సమయం వృథా అవుతోందని ఆవేదన

కన్నీరు మిగిల్చిన చామంతి

● దిగుబడి రాక తీవ్ర నష్టం 6

ప్రశాంతంగా పాలిసెట్

● 87శాతం హాజరు 7



కడపలోని పరీక్ష కేంద్రం వద్ద సందడి

పెయింటు వేస్తూ.. కరెంటు తీగలు తగిలి ఇద్దరు మృతి

7

పసుపు.. బాగు



దువ్వూరులో ఉడకబెట్టి ఆరబోసిన పసుపు

దువ్వూరు / చాపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పసుపు సాగు చేసిన రైతులు సంబరపడుతున్నారు. మార్కెట్‌లో ధర పర్వాలేదని అనిపించడమే ఇందుకు కారణం. మైదుకూరు నియోజకవర్గం వ్యాప్తంగా పసుపు పెద్దఎత్తున సాగైంది. ప్రస్తుతం దిగుబడులు వస్తున్నాయి. దువ్వూరులో కోగటం దానం అనే వ్యక్తి 60 సెంట్ల విస్తీర్ణంలో పసుపు పంట సాగు చేశాడు. పంట పొలం నుంచి తీసి ఉడకబెట్టి ఆరబెట్టారు. ఆరబెట్టిన వట్టి పసుపు 25 క్వింటాళ్లు అయింది. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన వట్టి పసుపుధర రూ.11,500 నుంచి రూ.12 వేల దాకా పలుకుతోంది. ఈ లెక్కన 25 క్వింటాళ్ల వట్టి పసుపునకు రూ.3 లక్షలు చేతికందే అవకాశం ఉంది. పెట్టుబడి ఖర్చులు పోను రైతుకు రూ.1.50లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే పసుపు దిగుబడులను రైతులు అమ్ముకోవడం లేదు. ఇంకా ధర పెరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కాగా.. కొంతమంది రైతులు ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడులు సాధించారు. ధర పెరిగితే వీరందరికీ మంచి లాభాలు అవకాశం ఉంది.

విత్తనం పసుపు పుట్టి రూ.7 వేలు

విత్తనం పసుపు పుట్టి (240 కేజీలు) రూ.7 వేలు పలుకుతోంది. ప్రస్తుతం రైతులు విత్తనం పసుపును విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో జూలై నెలలో భూమిలో విత్తనం పసుపు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ముందుగానే కొనుగోలు చేసి చెట్లకింద కుప్పలుగా పోస్తున్నారు. నెలన్నర రోజులకు ఆ పచ్చిపసుపు మొలకెత్తుతుంది. దాన్ని చిన్నముక్కలుగా విరిచి విత్తుతారు. ప్రస్తుతం వట్టి పసుపు క్వింటాలు కడప మార్కెట్‌లో రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధర లభిస్తోంది. ధర బాగుండడంతో రైతులు ఆశతో విత్తనం పసుపును కొనుగోలు చేస్తున్నారు. మైదుకూరు, వనిపెంట ప్రాంతాల నుంచి పసుపును కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.



చాపాడులో ట్రాక్టర్‌లో విత్తన పసుపు తీసుకుపోతున్న దృశ్యం

పుష్పగిరికి పోటెత్తిన భక్తులు

వల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, లక్ష్మిచెన్నకేశవ బ్రహ్మోత్సవాలతో పాటు అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం పుష్పగిరికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు శివకేశవులను దర్శించుకుని కాయ కర్పూరం చెల్లించారు. తెల్లవారుజామునే వెళ్లి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా కామాక్షి సమేత వైద్యనాథేశ్వరుడిని, తరువాత కొండమీద లక్ష్మిచెన్నకేశవ సంతాన మల్లేశ్వరున్ని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నదిలో స్నానం చేసిన అనంతరం బట్టలు మార్చుకునేందుకు నిర్వాహకులు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు. మరో పక్క పుష్పగిరి క్షేత్రంలోని జగద్గురు ఆది శంకరాచార్యపీఠంలో పీఠాధిపతి విద్యానృసింహస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా కొండపై శివాలయంలో సాయంత్రం నందివాహనంపై వైద్యనాథేశ్వరుడు ఊరేగారు. ప్రదోష కాలంలో చెన్నకేశవస్వామికి గరుడవాహనంపై గ్రామోత్సవం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం కామాక్షి సమేత వైద్యనాథేశ్వరాలయంలో ఉదయాన్నే కల్యాణోత్సవం, ప్రదోష కాలంలో చెన్నకేశవుడికి కల్యాణం ఉంటుందని కార్యనిర్వాహకులు తెలిపారు.



పూలంగి సేవలో చెన్నకేశవుడు



పుష్పగిరి వద్ద పెన్నానదిలో భక్తుల సందడి



మల్లయ్యకొండకు పర్యాటక శోభ

- వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలకు రూ.45 లక్షలు మంజూరు
- రూ.8.5 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాలు
- రూ.30 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండ పర్యాటక శోభ సంతరించుకోనుంది. రెండో శ్రీశైలంగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొండకు వచ్చే భక్తులు, పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించి సేద తీరేందుకు వీలుగా గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద ఓ వాచ్ టవర్, రెండు పగోడాల నిర్మాణాలకు సుమారు రూ.45 లక్షల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు మంజూరు చేసింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తైతే సందర్శకులు వాచ్‌టవర్ పైకెక్కి మల్లయ్యకొండ చుట్టూ విస్తరించి ఉన్న పచ్చదనం పరుచుకున్న అడవులు, ఎత్తైన కొండలు, లోతైన లోయలు, అడవిలో దాగున్న ప్రకృతి అందాలను తిలకించవచ్చు. పగోడాల కింద ఉల్లాసంగా, ఉత్సాహంగా సేదతీరవచ్చు. దీంతో పాటుగా పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం కోనేరుకు సమీపంలో సుమారు రూ.8.5 లక్షల నిధులతో మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా కొండపైన ఉద్యానవనం, ప్లాంటేషన్, పాత్‌లు, గౌరమ్మకుప్ప వాచ్‌టవర్ నుంచి గోశాల వద్దకు మెటుకులు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి మరో రూ.30 లక్షల నిధులకు ప్రతిపాదనలు పంపినట్లు అటవీ శాఖ ఎఫ్ఆర్వో జయప్రసాదరావు తెలిపారు.

ప్రకృతి అందాల నడుమ మల్లన్న

సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో ప్రకృతి అందాల నడుమ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మూడు కొండల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కొలువై ఉన్నాడు. మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. ప్రతి సోమవారం, కార్తీక సోమవారాల్లో అయితే కొండకు వచ్చే భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. మహాశివరాత్రి పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు కొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. కొండపైకి చేరుకునేందుకు ప్రతి సోమవారం ఆర్టీసీ బస్సులతో పాటు కొండ కింద నిత్యం ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

కొండపైన ఆహ్లాదకరమైన వాతావరణం

సముద్రమట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో ఉన్న మల్లయ్యకొండ పైన ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తుంది. శీతాకాలంలో ఊటీని తలపిస్తూ, వేసవిలో స్వచ్ఛమైన చల్ల గాలులను అందిస్తూ, వర్షాకాలంలో అరకు అందాలను మైమరపించే విధంగా కాలానికి తగ్గట్టుగా కొండ పైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్, ఆలయం ముందు ఉన్న వ్యూ పాయింట్‌ల నుంచి చూస్తే ఎత్తైన పచ్చని కొండలు, లోతైన లోయలు, పచ్చదనం పరుచుకున్న చెట్లు, నింగి నేల ఏకమైనట్లుగా కనిపించే దృశ్యాలు మనసును కట్టిపడేస్తాయి. కొండ కింద నుంచి కొండ పైకి ప్రయాణించేటప్పుడు వంపులు తిరిగిన ఘాట్ రోడ్డు మలుపులు ఎంతగానో అబ్బురపరుస్తాయి.

రూ.45 లక్షలతో వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణాలు

మల్లయ్యకొండ పైన ఆలయానికి ఉత్తర దిక్కున అర కి.మీ. ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడ ఎత్తైన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓ వాచ్ టవర్‌తో పాటు రెండు పగోడాల నిర్మాణాలు చేపడుతున్నారు. గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ (ప్రస్తుతం వాచ్‌టవర్ నిర్మిస్తున్న ప్రదేశం) నుంచి చూస్తే సుమారు 150 కి.మీ. పైగా దూరంలో ఉన్న తిరుమల కొండలు కనిపిస్తాయి. ప్రస్తుతం వాచ్‌టవర్‌ను 20 అడుగుల ఎత్తుతో రెండు అంతస్తులుగా నిర్మిస్తున్నారు. వాచ్‌టవర్ పైకి ఎక్కి చూస్తే సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో చుట్టూ విస్తరించి ఉన్న దట్టమైన అడవులను చూడవచ్చు. దీంతో పాటుగా వాచ్‌టవర్ పక్కనే సందర్శకులు సేద తీరడానికి వీలుగా రెండు పగోడాలను నిర్మిస్తున్నారు. దీంతో పాటుగా కోనేరుకు సమీపంలో సుమారు రూ.8.5 లక్షల నిధులతో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానపుగదుల నిర్మాణాలు చేపడుతుండగా పనులు చివరి దశలో ఉన్నాయి.

వాచ్‌టవర్‌తో అనేక ప్రయోజనాలు

వాచ్‌టవర్లు పర్యాటకులు అడవులను సందర్శించడానికే కాకుండా అడవుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాచ్‌టవర్ పైకి ఎక్కి పరిశీలిస్తే అడవిలో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. అటవీ అధికారుల పర్యవేక్షణ పెరిగి చెట్లు నరికివేత, వన్య ప్రాణుల వేట వంటివి ఆగిపోయే అవకాశం ఉంటుంది. వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగితే ఆ ప్రాంతాన్ని త్వరగా గుర్తించే వీలుంటుంది.

పూర్తి కావస్తున్న పనులు



మల్లయ్యకొండపైన అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వాచ్‌టవర్, రెండు పగోడాలు, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనుల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నాం. వీటి నిర్మాణం పూర్తయితే కొండకు వచ్చే భక్తులు మరింత ఆహ్లాదాన్ని పొందవచ్చు. వీటితో పాటు కొండ పైన ఉద్యానవనం, ప్లాంటేషన్, పాత్‌లు వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి సమారు రూ.30 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎఫ్ఆర్వో, జయప్రసాదరావు



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నిర్మిస్తున్న వాచ్‌టవర్



వాచ్‌టవర్ వద్దకు తాపల నిర్మాణం కోసం చదును చేసిన స్థలం



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నిర్మిస్తున్న పగోడాలు

చందనాలంకారంలో వీరభద్రుడు



చందన అలంకారంలో వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో స్వామి, అమ్మవార్లకు చందన అలంకార వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ అమ్మవారికి, వీరభద్రుడికి ప్రత్యేక చందన అలంకార అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అక్షయ తృతీయ పూజలు చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు ఆలయానికి వచ్చి చందన అలంకారంలో ఉన్న వీరభద్రస్వామి వారు, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అక్షయ తృతీయ విశిష్టత గురించి చందన అలంకారం విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనుకున్నదే చేశారు..!

- అంశాల వారీగా ఆమోదం
- నాలుగు అంశాల తిరస్కరణ
- నామమాత్రంగా కౌన్సిల్ సమావేశం



కశ్మీర్ ఉగ్ర దాడి మృతులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న కౌన్సిలర్లు

మదనపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం నిర్వహించిన మదనపల్లె మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం గతం కంటే భిన్నంగా సాగింది. కౌన్సిలర్ పెరవలి రాజేశ్‌తో పాటు ఒకరిద్దరు ఎజెండాలోని అంశాన్ని అంకెల వారీగా చెబుతూ, ఆమోదం, తిరస్కరణ (రద్దు) అంటూ సమావేశాన్ని నిమిషాల వ్యవధిలోనే ముగించేశారు. మార్చి నెలలో సమావేశంలో తొమ్మిది వార్డుల్లో రూ.5.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఎజెండాలో పేర్కొని, మిగిలిన వార్డులను గాలికొదిలేశారని వైసీపీ కౌన్సిలర్లు ఆందోళన చేశారు.

గత నెల ఎజెండా తరహాలోనే ఇప్పుడు కూడా 12 వార్డులకు రూ.5.27 కోట్లు పెట్టి, మిగిలిన 23 వార్డులను గాలికొదిలేశారని, ఈ ఎజెండాను కూడా రద్దు చేయాలని కౌన్సిలర్లు ఎస్.కరీముల్లా, మార్పూరి నాగార్జునబాబు డిమాండ్ చేస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీనికి స్పందించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ ప్రతిసారి సమావేశాన్ని రద్దు చేస్తే తాగునీరు, శానిటేషన్, వీధిలైట్లు, తదితర పనులు, సేవలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రయారిటీ ప్రకారం, వార్డుల్లో ప్రజలకు అవసరమయ్యే పనులను మాత్రమే తాను ర్యాటిఫై చేస్తున్నట్లు ప్రకటించారు. 20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసి మాట్లాడుతూ తమ వార్డుకు మంజూరు చేసి అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక వైసీపీ కౌన్సిలర్లు ఎజెండాలోని 20వ అంశాన్ని రద్దు చేశారని వాపోయారు. మున్సిపాలిటీలో టీడీపీ తరఫున విజయం సాధించింది తానేనని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా..తన వార్డులో అభివృద్ధికి అడ్డు తగలడం ఏంటని ప్రశ్నించారు. పట్టణంలోని 35 వార్డుల్లో 33 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా, ఎన్నడూ లేని విధంగా ఇద్దరు మినహా సమావేశానికి అంతా హాజరయ్యారు.

సాధారణ, అత్యవసర సమావేశ ఎజెండాల్లోని నాలుగు అంశాలు మినహా మిగిలిన 28 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల కార్యాలయం పనిమీద విజయవాడకు వెళ్లడంతో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డీఈ శ్రావణి వ్యవహరించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి, తదితరులు పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో కశ్మీర్ ఉగ్రదాడి మృతులకు ఆత్మశాంతి కలగాలని కౌన్సిల్ రెండు నిమిషాల మౌనం పాటించింది. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ తీవ్రవాదుల దాడి నేపథ్యంలో కేంద్రం తీసుకునే ఎలాంటి చర్యలకైనా తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించారు.

కన్నీరు మిగిల్చిన చామంతి

- దిగుబడి రాక తీవ్ర నష్టం



దిగుబడి రాని చామంతి పూల తోట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు చామంతి పూల తోట కన్నీరు మిగిల్చింది. వైరస్‌తో పాటు నీటి సమస్యతో పంట అనుకున్న ప్రకారం దిగుబడి రాకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చామంతి తోటలను సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుమారు 30 ఎకరాల్లో చామంతి సాగు చేశారు. ఎకరా చామంతి తోటను సాగు చేయాలంటే సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు 5 టన్నుల పూలు రావాల్సి ఉంది. కానీ వైరస్, నీటి సమస్యతో ఎకరాకు 2 టన్నులు మాత్రమే వచ్చాయి. వైరస్ కారణంగా పూల నాణ్యత కూడా తగ్గడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన పంటకు ఆశించిన రీతిలో ధర లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. కిలో చామంతి రూ.100 నుంచి రూ.110 ఉండేది కానీ ప్రస్తుతం రూ.60 మాత్రమే ధర ఉండడంతో పెట్టుబడి కూడా రాలేదు. మండలానికి చెందిన భీమవరం, జయచంద్రారెడ్డి ఐదెకరాలు, పెనల శివారెడ్డి 8 ఎకరాలు, క్రిష్ణారెడ్డి 8 ఎకరాల్లో మరికొందరు రైతులు చామంతి తోటలను సాగు చేశారు. ఈ ఏడాది చామంతి పూలు తమను అప్పులపాలు చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైరస్‌తో తీవ్ర నష్టం



చామంతి తోటకు వైరస్ సోకడంతో తీవ్రంగా నష్టపోయాం. పెట్టుబడిలో సగం కూడా రాలేదు. మండలంలో నీటి సమస్య కూడా అధికంగా ఉంది. ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందితే రైతులు సంతోషంగా ఉంటారు.

- భీమవరం జయచంద్రారెడ్డి, రైతు, ఒంటిమిట్ట

గంగోత్రిలో గల్లంతైన యువకుడు మృతి

మృతదేహాన్ని వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. బి.కొత్తకోట పట్టణంలోని జయశ్రీ కాలనీకి చెందిన దేసుగారి బాలకృష్ణ (30) మంగళవారం హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో ఉన్న గంగోత్రి కొలనులో గల్లంతయ్యాడు. అప్పటికే చీకటి పడడంతో అతడి మిత్రులు, అధికారులు చేసిన గాలింపు చర్యలు సఫలం కాలేదు. దీంతో బుధవారం ఉదయం సీఐ జీవన్ గంగనాథ్‌బాబు ములకలచెరువు నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, సిబ్బంది మానస సరోవరంలోని బోట్‌ను గంగోత్రిలోకి తరలించారు. రెండు శాఖల సిబ్బంది బోటులో కొలనులోకి గాలించి తాళ్లసాయంతో బాలకృష్ణ మృతదేహాన్ని వెలికితీశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం సాయంత్రం బి.కొత్తకోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్‌డీఏ ప్రిలిమినరీలో 28 మంది

సైనిక్ స్కూల్ విద్యార్థులకు అర్హత

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా జరిగిన రాత పరీక్షలో కలికిరి సైనిక్ స్కూల్‌కు చెందిన 28 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ సిహెచ్ పరదేశి తెలిపారు. ఏప్రిల్ 13న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వీరు సర్వీస్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) నిర్వహించే ఇంటర్వ్యూలో పాస్ కావాల్సి ఉంది. కలికిరి సైనిక్ స్కూల్ నుంచి 64 మంది ప్రిలిమినరీ పరీక్షలకు హాజరుకాగా అందులో 28 మంది అర్హత సాధించడం అరుదైన అంశమని తెలిపారు. ఇందులో ఈ ఏడాది 2024-25 బ్యాచ్ 12వ తరగతి విద్యార్థులు 18 మంది క్వాలిఫై కాగా, పది మంది గతేడాది బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులని వివరించారు. గత నాలుగు బ్యాచ్‌లకు చెందిన విద్యార్థుల్లో ఇప్పటి వరకు 18 మంది ఎంపికై భారత సాయుధ దళాల్లో చేరినట్లు తెలిపారు. ఎన్‌డీఏ ప్రవేశ పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది బ్యాచ్‌కు (2024-25) చెందిన విద్యార్థులు 12వ తరగతి పూర్తి కాకుండానే గత అక్టోబరులో జరిగిన ప్రవేశ పరీక్షలకు హాజరయ్యారు. అందులో ఇటీవలే పూర్తయిన ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలో నలుగురు విద్యార్థులు ఎంపికైన విషయం తెలిసిందే.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ మద్దెలచెరువుకు చెందిన రవికుమార్ నిమ్మనపల్లి అగ్రహారం మార్గంలో బైక్‌పై వస్తుండగా తరిగొండవారిపల్లికి చెందిన పులి రెడ్డెప్పరెడ్డి తన ద్విచక్రవాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు రెడ్డెప్పరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు



మద్యంతో పట్టుబడిన ఆనందకుమార్‌రెడ్డి

రామసముద్రం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని మినికి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీస్ గంగిరెడ్డి, శ్రీనివాసులతో కలిసి తనిఖీ నిర్వహించి ఆనంద్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 43 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా : ఇరువురికి గాయాలు

నిమ్మనపల్లి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లి మండలం కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మదనపల్లికి చెందిన అశోక్‌కుమార్ (22), ప్రదీప్ (24) మంగళవారం రాత్రి తవళం పంచాయతీలోని నేలమల్లేశ్వర స్వామి ఆలయం నుంచి మదనపల్లికి వస్తుండగా ఎగువమాచిరెడ్డిగారిపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని మదనపల్లి తరలించగా అక్కడ డాక్టర్లు తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



విలపిస్తున్న మృతుడి తండ్రి ఇబ్రహీం, నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

చిన్నమండెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని షిఫాయత్‌ఖాన్ (19) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమండెం మండల కేంద్రానికి చెందిన షిఫాయత్‌ఖాన్, ఖాదర్‌వలీలు ద్విచక్రవాహనంలో తన సొంత అవసరాల నిమిత్తం రాయచోటికి వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యాహ్న సమయంలో కడప-బెంగళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని షిఫాయత్ ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా ఖాదర్‌వల్లి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం శివారులోని భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో ఆటో, స్కూటర్ ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం కడప-చెన్నై ప్రధాన రహదారిలో ఉదయం ఊటుకూరు ఎస్సీ కాలనీకి చెందిన రెడ్డిపోగు శంకరయ్య, క్రిష్ణయ్య బైకుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను ఢీకొనడంతో కృష్ణ తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. శంకరయ్య కాలికి గాయమైంది. వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పందెం కోళ్లను వేలం వేసిన పోలీసులు



కోడిని వేలం వేస్తున్న పోలీసులు

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు గ్రామం సమీపంలోని ఒక తోటలో జరుగుతున్న కోడి పందాలపై దాడులు చేసిన కలికిరి పోలీసులు పందెంరాయుళ్లతో పాటు నాలుగు పందెం పుంజులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా 8 మంది నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం జరిగిన ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న పందెంకోళ్లను వేలం వేసేందుకు వాయల్పాడు కోర్టు న్యాయాధికారి అనుమతి తీసుకున్నారు. ఆ ప్రకారం బుధవారం పోలీసుస్టేషను ఆవరణలో వేలం నిర్వహించగా రూ.6500లకు వేలం పాట నిలిచింది. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కోర్టు పద్దులో జమచేయనున్నట్లు కలికిరి ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మహబూబ్‌బాషా, హెచ్‌సీ మదనమోహన్‌రెడ్డి, పోలీసులు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

స్టడీ సర్టిఫికెట్ల కోసం...

డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూపులు చూస్తున్న అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీపి కబురు చెప్పింది. మెగా డీఎస్సీ-2025ని ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఉద్యోగ సాధన కోసం రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్లను కూడా అప్‌లోడ్ చేయాలనే నిబంధన పెట్టారు. అయితే ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో పాఠశాలల్లో హెచ్‌ఎంలు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

- డీఎస్సీ అభ్యర్థుల సతమతం
- స్కూళ్లకు వేసవి సెలవులు
- అందుబాటులో లేని ప్రధానోపాధ్యాయులు
- సమయం వృథా అవుతోందని ఆవేదన



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ క్రమంలో డీఎస్సీ పరీక్షకు చదువుకునేందుకు విలువైన సమయాన్ని కోల్పోవడమే గాక, రోజుల తరబడి స్టడీ సర్టిఫికెట్ల కోసం పాఠశాలల చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే వారే లేరని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభం కాగా, మే 15న ముగియనుంది. ఈలోగా వేసవి సెలవులు ముగిసే అవకాశం లేకపోవడంతో స్టడీ సర్టిఫికెట్లను పొందడానికి స్కూలు హెచ్‌ఎంలను, ఉపాధ్యాయులను ఫోన్లలో సంప్రదిస్తూ అభ్యర్థిస్తుండడం మినహా ప్రత్యామ్నాయం కనబడటం లేదని చెబుతున్నారు.

30 ఏళ్ల నాటి సర్టిఫికెట్ల కోసం వెతుకులాట

డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థుల వయో పరిమితిని 44ఏళ్లకు పెంచిన విషయ విధితమే. ఆ ప్రకారం సంబంధిత వయసు గల అభ్యర్థులు సుమారు 35ఏళ్ల క్రితం ప్రాథమిక పాఠశాల ల్లో చదివిన 4వ తరగతి మొదలుకొని ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల నుంచి పొంది.. డీఎస్సీ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల స్థానికతను నిర్ధారించేందుకు ఈ స్టడీ సర్టిఫికెట్లనే ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలి సిందే. ఈ ధ్రువపత్రాల ప్రకారమే అభ్యర్థుల లోకల్, నాన్‌లోకల్ స్టేటస్‌ను ఉద్యోగ ఎంపికల్లో నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలో దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం చదువుకున్న పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందడానికి అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం స్కూళ్లకు వేసవి సెలవులు పెద్ద ఆటంకంగా మారాయని చెబుతున్నారు.



అందుబాటులో ఎంఈఓలు

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ సర్టిఫికెట్ ఇచ్చే విషయలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా అందుబాటులో ఉండాలని ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. అలాగే జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, మండల పరిషత్ పాఠశాలలకు సంబంధించిన ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు స్టడీ సర్టిఫికెట్స్ విషయంలో అలసత్వం లేకుండా ఇచ్చేందుకు అందుబాటులో ఉండాలి.

-షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే...

డీఎస్సీ, ఇతర ఉద్యోగ నియామకాల పోటీ పరీక్ష లకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన, ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న అభ్యర్థులను మినహాయిస్తే, వీటిని ఇంత వరకు సమకూర్చుకోలేని వారే ఇపుడు ఆందోళన చెందుతున్నారు. ఈ కోవలో స్టడీ సర్టి ఫికెట్ల సమస్య కీలకంగా మారింది. 10 పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రస్తుతం హైస్కూళ్లలో రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తుండడంతో హెచ్‌ఎంలు అందుబాటులో ఉంటు న్నందున స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు డీఎస్సీ అభ్యర్థులకు ఇబ్బందులు తలత్తడం లేద ని తెలుస్తోంది. దీనికి భిన్నమైన పరిసితులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకొన్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఈ పాఠశాలలు మూసి ఉంటున్నాయి. స్టడీ సర్టిఫికెట్లు జారీ చేయాలంటే అభ్యర్థులు ఆయా సంవత్సరాల్లో చదివిన తరగతుల రికార్డులు, రిజిస్టర్లను స్కూలు ప్రధానోపాధ్యా యుడు, బోధన, బోధనేతర సిబ్బంది పరిశీలించి, ధ్రువీకరించుకున్న తర్వాతే హెచ్‌ఎం సంతకం చేసి ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు తాళాలు వేసి ఉంటున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. స్కూలు, హెచ్‌ఎం, టీచర్లకు ఫోన్ చేసి సర్టిఫికెట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టడీ సర్టిఫికెట్ల కోసం ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం పరిష్కారం చూపాల్సి ఉంది.

19 ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు రూ.1.93 కోట్ల రాయితీలు

కడప, కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్ఠం చేయాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీలో భాగంగా 2023-27 ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 19 టాన్స్‌పోర్టు వాహనాలకు పెట్టుబడి సబ్సిడీ కింద రూ.1.93 కోట్ల రాయితీలు మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో పరిశ్రమల జనరల్ మేనేజరు చాంద్ బాషా, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనరు రాకేష్‌చంద్ర, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్దన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబరు శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను సమూలంగా నిర్మూలించాలి

- కేంద్రం తీసుకునే నిర్ణయాలను అందరూ సమర్థించాలి

వేంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సమగ్రత సార్వభౌమత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని... ఉగ్రవాదుల సమూల నిర్మూలనకు కేంద్రం తీసుకునే నిర్ణయాలను అందరు సమర్థించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఈనెల 28న జైపూర్ బహిరంగ సభలో ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు సమైక్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారని ఆ ప్రకటనలో గుర్తుచేశారు. దేశభక్తి గురించి కాంగ్రెస్ పార్టీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వద్ద నేర్చుకునే దుస్థితిలో లేదన్నారు. పాకిస్థాన్‌పై ప్రేమ ఉంటే కాంగ్రెస్ నాయకులు పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలని పవన్ కళ్యాణ్ చెప్పడం ఆయ న అవివేకానికి నిదర్శనమన్నారు. ఉగ్రదాడి జరిగి ఎనిమిది రోజులు అవుతున్నా ఒక్క ఉగ్రవాదినైనా ఎందుకు పట్టుకోలేదో మోడీని ప్రశ్నించాలని పవన్‌కు సలహా ఇచ్చారు.

సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా ఆదినారాయణరావు



జి.ఆదినారాయణరావు

కడప రూరల్/ సిద్దవటం, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఏజీ పీగా ఒంటిమిట్ట గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది జి.ఆదినారాయణరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయ న గత 12 సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీలోని న్యాయవిభాగంలో క్రియాశీలకంగా పనిచేస్తూ పలు కీలక పదువులను చేపట్టి పార్టీలో గుర్తింపు పొందారు. ఈయన సేవలను టీడీపీ గుర్తించి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు సిద్దవటం కోర్టు ఏజీపీగా నియమించారు.

పెయింటు వేస్తూ..కరెంటు తీగలు తగిలి ఇద్దరు మృతి

- మరొకరికి గాయాలు



మృతుడు వెంకటరమణ (ఫైల్)

కడప క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బాలాజీనగర్‌లోని ఓ ఇంటికి పెయింట్ వేస్తూ ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా... మరొకరు గాయపడ్డారు. కడప తాలుకా ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ వివరాల మేరకు.. కడప నగరం వైజంక్షన్‌కు చెందిన పసుపులేటి వెంకటరమణ (53) పెయింటు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య జానకి, కొడు కు, కుమార్తె ఉన్నారు. బాలాజీనగర్‌కు చెందిన రామచంద్ర ఇంటిని పెయింటు పనులు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయనకు సహాయకుడుగా సీకేదిన్నె మండలం ఇందిరానగర్‌కు చెందిన ఈశ్వరయ్య (23), అతని తండ్రి రామయ్యలు ముగ్గురూ కలిసి నాలుగు రోజుల నుంచి పెయింటు పనులు చేస్తున్నారు. అయితే బుధవారం ఇంటి బయట పెయింటు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వెంకరటమణకు విద్యుత్ తీగలు తగలడంతో పక్కనే ఉన్న ఈశ్వరయ్య, రామయ్యలు షాక్‌కు గురై ముగ్గురూ కింద పడ్డారు. దీంతో వెంకటరమణ, ఈశ్వరయ్యలు మృతి చెందగా, రామయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఈశ్వరయ్యకు రెండేళ్ల క్రితం కమలాపురానికి చెందిన మహేశ్వరితో వివాహం జరిగింది. ఒకటిన్నర సంవత్సరం బాబు ఉండగా ప్రస్తుతం ఆమె ఆరు నెలల గర్భిణి. ఒక వైపు భర్త మృతి చెందడం, మరో వైపు మామ గాయపడటంతో గుండెలవిసేలా రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లుతెలిపారు.

రిమ్స్‌లో సౌకర్యాలకు యూసీఐఎల్ రూ.53.67 లక్షల విరాళం



కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి చెక్కు అందజేస్తున్న యూసీఐఎల్ ప్రతినిధులు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కడపలోని రిమ్స్ ఆసుపత్రిలో సదుపాయాల కల్పనకు రూ.53.67 లక్షల విరాళాన్ని బుధవారం యూసీఐఎల్ ప్రతినిధులు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి అందజేశారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా సామాజిక బాధ్యతగా రిమ్స్ సర్వజన ఆసుపత్రిలో పరికరాలు, ఇతర సౌకర్యాల కల్పనకు విరాళం అందజేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ వేముల మడలం తుమ్మలపల్లి వద్ద ఉన్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు అందజేసిన నిధులతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, గైనిక్, ఈఎన్‌టీ, రేడియాలజీ, అనిస్థీషియా డిపార్మెంట్‌లకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తామన్నారు. ఆసుపత్రిలో మౌలిక సదపాయాల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కలెక్టర్‌కు చెక్కును అందజేసిన వారిలో యూసీఐఎల్ సీఎస్ఆర్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, జియాలజిస్ట్ సురేంద్రవిజయకుమార్, మేనేజర్ పీకే నాయక్, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

నెల్లూరు రోడ్డు ప్రమాదంలో మెడిసిన్ విద్యార్థికి తప్పిన ప్రమాదం

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందగా.. మైదుకూరుకు చెందిన వీరమల్లు నవనీత్ శంకర్ అనే మెడిసిన్ విద్యార్థి ప్రాణాలతో బయట పడ్డారు. ఇతని తండ్రి వీరమల్లు మల్లేష్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్నారు. కాగా, నవనీత్ శంకర్ నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం నవనీత్ శంకర్ తన స్నేహితుడి అక్క నిశ్చితార్థానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు అతని తల్లిదండ్రులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ఖిమావత్ అభిషేక్ రాజ్, గుండాల జీవన్ చంద్రారెడ్డి, గుర్రం యష్మిష్, నరేష్ నాయక్, అభిసాయి పురుషోత్తంలు అక్కడికక్కడే మృతి చెందారు. నవనీత్ శంకర్ తీవ్ర గాయాలతో నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే డాక్టర్ మల్లేష్ కుటుంబ సభ్యులతో నెల్లూరు బయలుదేరి వెళ్లారు.

యువకుడు ఆత్మహత్య



లింగాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లెలో బుధవారం వెన్నపూస విశ్వచందన్‌రెడ్డి (34) అనే యువకుడు ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. వెన్నపూస పక్కీరారెడ్డి కుమారుడు విశ్వచందన్‌రెడ్డికి రెండేళ్ల క్రితం తాడిపత్రిలో జరిగిన ప్రమాదంలో కుడికాలు తొలగించారు. అప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడు తున్నాడు. అలాగే వయసు పెరిగిపోతున్నా వివాహం కాలే దని.. మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్

- 87శాతం మంది విద్యార్థులు హాజరు



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 87శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు కడప నగరంలో 12 కేంద్రాలు, ప్రొద్దుటూరులో నాలుగు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 7271 మంది (87శాతం) విద్యార్థులు హాజరయ్యారు. 997 మంది గైర్హాజరయ్యారు. కడప నగరంలో 3953 మంది విద్యార్థులకు 3309 మంది హాజరు కాగా.. 64 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను పాలిసెట్ కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ జ్యోతి, అడిషనల్ కోఆర్డినేటర్ దామోదరం పర్యవేక్షించారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ సూచించారు. బుధవారం జమ్మలమడుగు సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. సబ్‌జైలులో లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యత గురించి తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం తదితర వాటికి సంబంధించి వివరించారు. అనంతరం జైలులో పరిసరాలను పరిశీలించారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

34 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ దుంగలతో ఫారెస్టు అధికారులు

కడప క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మామిళ్లపల్లె సెక్షన్ ఇప్పెంట బీట్ పాలకొండలో బుధవారం ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాకు పాల్పడుతుండగా ఫారెస్టు అధికారులు దాడులు చేశారు. ఫారెస్టు అధికారులు చూసిన స్మగ్లర్లు దుంగలు ఉన్న కారును వదిలి పరారీ అయ్యారు. కడప ఫారెస్టు రేంజ్ అధికారి ప్రసాద్ వివరాల మేరకు.. పాలకొండలో ఎర్రచం దనం దుంగలు అక్రమరవాణా సాగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు చేశామన్నారు. స్మగ్లర్లు ఇన్నోవా కారును వదిలేసి పరారయ్యారని... దీంతో కారులో ఉన్న 34 ఎర్రచందనం దుంగలను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. కారు ఓనరు పులి ప్రసాద్‌గా గుర్తించామని.. పరారైన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామ తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసరు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీలో ఘర్షణ.. ఒకరి మృతి



కత్తి శ్రీనివాసులు (ఫైల్)

వేంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం రాజీవ్‌కాలనీలో మంగ ళవారం రాత్రి జరిగిన ఘర్షణలో కత్తి శ్రీనివాసులు (50) అనే వ్యక్తి మృతి చెం దాడు. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయ న తెలిపిన వివరాల మేరకు... రాజీవ్ నగర్ కాలనీలో పండుల కోసం ముసురు నీళ్లు, ఆహార పదార్థాలు డ్రమ్ముల్లో వేయించుకునే విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కత్తి శ్రీనివాసులు ఆయన కుమారుడు అంకయ్యలపై వెంకటేష్, అంజి, శివ తదితరులు దాడికి దిగారు. ఈ దాడిలో కత్తి శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు వెంకటేష్, రాయుడు, అంజి, శివ, చిన్న, రమణ తదితరులపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నక్క (65) అనే వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. చౌడూరు గ్రామానికి చెందిన చిన్నక్క జమ్మలమడుగు ప్రధాన రహదారి దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆమెను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముద్దనూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1990-91 పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు ప్రసాద్, రమాదేవి, శివప్రభాకర్, మహబూబ్ సాహెబ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తమ జ్ఞాపకాలను ఉపాధ్యాయులు పంచుకున్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు వారు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు రూ.27వేల విలువ చేసే 50 కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు భాస్కర్, శేఖర్, జెట్టిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రేపటి నుండి ఉచిత బాలవికాస్ తరగతులు

కడప కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు మే 1వ తేదీ నుండి నగరంలోని ఆకులవీధిలో ఉన్న రాజరాజేశ్వరి దేవస్థానంలో ఉచిత బాలవికాస్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పీడతల గోపాలక్రిష్ణశర్మ, ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక రాజరాజేశ్వరి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం 9 నుండి 11గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఇందులో ప్రధానంగా సనాతన ధర్మం, హైందవ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసం, భగవద్గీత ఇతర పురాణాలను బోధిస్తారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9966265101 నెంబరును సంప్రదించాలన్నారు.

రేషన్‌కార్డు ఈ-కేవైసీ గడువు పొడిగించాలి

పులివెందుల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఉన్న సభ్యులు ఈ-కేవైసీ చేసుకోవాలని విధించిన గడువును పొడిగించాలని వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, ఇతరప్రాంతాలలో చదువుకుంటున్న పిల్లలు అనేక మంది ఉన్నారన్నారు. అందులోనూ పరీక్షల సమయం కావడంతో గడువు పెంచాలన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం..

- ముందుకు కదలని మురుగు
- కాల్వల్లో పేరుకుపోతున్న చెత్త
- దోమల స్వైర విహారం





చెత్తాచెదారంతో నిండిన కాల్వలు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 33వ డివిజన్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో పెద్దఎత్తున చెత్త, మురుగు కాల్వల్లో పేరుకుపోతోంది. నగరంలోని అమీన్‌పీర్ రోడ్డు మొదలుకొని ఆయా ప్రాంతాల కాల్వలలో మురుగు కదిలే పరిస్థితి లేదు. రోడ్లపైనే చెత్త వేస్తుండడంతో దోమల బెడద ఎక్కువైంది. ఎక్కడకు వెళ్లినా మురుగు కంపుకొడుతోంది. నగరంలోని ప్రధాన కాల్వలు మూడు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు కొన్ని ప్రాంతాలలో చెత్తను కాల్వల్లో వేయడంతో మురుగు కదలడం లేదని, పరిశుభ్రత లోపించడంతో పాటు అంటువ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. పలుప్రాంతాలలో వైద్యశాలలకు సంబంధించిన వ్యర్థాలను కూడా కాల్వల్లోనే వేస్తుండడంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువైందని, ఈ క్రమంలో పారిశుధ్య చర్యలు చేపట్టకపోడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



8న అబ్దుల్ కలామ్ ప్రతిభా పురస్కారాలు

కడప రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని దూదేకుల భవన్‌లో మే 8వ తేదీ న ఉత్తమ మార్కులు సాధించిన దూదేకుల విద్యార్థులకు డాక్టర్ అబ్దుల్ కలామ్ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు గగ్గటూరు నజీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పదో తరగతిలో మంచి మార్కులతో పాస్ అయిన పేద విద్యార్థులకు ప్రతి ఏడాది దూదేకుల సంఘం ఆధ్వర్యంలో ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. జిల్లాలోని సంఘం కార్యవర్గ సభ్యులు, దూదేకుల సంఘీయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మండల మీట్

వేంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేం పల్లె మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీవో కుళాయమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

కులగణనపై హర్షం

కడపసెవెన్‌రోడ్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న జనాభా లెక్కల్లో కులగణన కూడా చేపట్టేందుకు కేంద్రం నిర్ణయంచడం పట్ల బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కులగణనతో సామాజిక న్యాయం, విద్యా, ఉద్యోగాలలో అవకాశాలలో బీసీల వాటా స్పష్టత వస్తుందన్నారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల వేతనాలు పెంచాలని వీఆర్‌ఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకులకు 11 సంవత్సరాలుగా వేతనాలు పెంచక, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మినిమం రూ.26వేల వేతనం, ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి నామినల్‌గా పనిచేసిన వారిని కంటిన్యూ చేయాలన్నారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా మే 20న పెద్దఎత్తున దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, వీఆర్‌ఏ యూనియన్ నాయకులు నాగేంద్ర, వెంకటపతి, రమణ, పవన్, మునెయ్య, పెద్దనారాయణ, వెంకటసుబ్బయ్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, తక్షణం 12 నెలల వేతనాలు విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ యూనియన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14వేల మంది పనిచేస్తున్నారని, 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. వేతనాలు విడుదల కాని పక్షంలో ఆందోళనకి పిలుపునిస్తామని హెచ్చరించారు.

వాణిజ్యశాస్త్రంలో మురళికి వైవీయూ డాక్టరేట్



డాక్టరేట్ నోటిఫికేషన్ అందుకుంటున్న ఎం.మురళి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో చేనేత కార్మికుల జీవితాలపై అధ్యయనం చేసిన యోగి వేమన యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగ రీసెర్చ్ స్కాలర్ ఎం.మురళికి డాక్టరేట్ (పీహెచ్‌డీ) లభించింది. చేనేత కార్మికుల సంక్లిష్ట సవాళ్ల అన్వేషణ-ఒక అధ్యయనం (ఎ స్టడీ ఆఫ్ ఎక్స్‌ప్లోరింగ్ ద కాంప్లెక్సిటీస్ అంటే చాలెంజెస్ ఆఫ్ హ్యాండ్లూమ్ వీవర్స్ ఇన్ అనంతపూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అనే అంశంపై వాణిజ్య శాస్త్ర ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. మురళికి డాక్టరేట్ లభించడం పట్ల వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యాపకులు అభినందించారు.

'వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనది'

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎమ్మెల్యే ఆర్.మాధవి అన్నారు. కడపలోని ఫాతిమా వైద్యకళాశాలలో 2021 బ్యాచ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్, 2019 బ్యాచ్ యూజీ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అమీర్‌బాబు, ప్రభుత్వ మెడికల్ కళాశాల రిటైర్డ్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, కళాశాల సెక్రటరీ జవ్వాద్, వైస్ చైర్మన్ ఫారుబి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో క్యాన్సర్ అనే మహమ్మారి ప్రబలుతోందని, ప్రతి వైద్యుడు ఉచితంగా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలరేఖ, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్‌ముర్తుజా, సూపరింటెండెంట్ డాక్టర్ నాగేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ సేవలు అమలులోకి తేవాలి

- సలావుద్దీన్

కడప కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హజ్ హౌస్ పునర్నిర్మాణం చేసి పవిత్ర హజ్ సేవలు అమలులోకి తేవాలని ముస్లిం సమ్మైవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం హజ్‌హౌస్ పరిరక్షణ యూత్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ హిదయతుల్లాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. హజ్ హౌస్ పరిసరాలను శుభ్రం చేసి నీటి సమస్య, విద్యుత్ సమస్య, భద్రత సౌకర్యాలు కల్పించాలని కోరారు. పవిత్ర హజ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి : కలెక్టర్

కడప,కలెక్టరేట్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో ఈనెల 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్నారని, ఈ పర్య టనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశిం చారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుం డి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రధాని పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బా ధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గం నుండి స్థానిక ప్రతినిధులు ప్రధాని పర్యటనలో పాల్గొనేందుకు ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. అందుకు సంబంధించి కట్టు దిట్టమై న భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రధాని పర్య టన కార్యక్రమాలు సజావుగా సాగేలా జిల్లా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, ఆదిశేషారెడ్డి, నాగేశ్వర రావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి
పదవీవిరమణ పొందడం అభినందనీయం

- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



ఏఎస్ఐ జయశంకర్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖకు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విశేష సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని పెన్నార్ పోలీసుకాన్ఫరెన్స్ హాలులో పదవీవిరమణ పొందిన ఎం.పర్వీన్, జయశంకర్, శ్రీనివాసులును సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అందించిన సేవలే విరమణ అనంతరం కూడా గుర్తుండిపోయేలా మంచి పేరు, ప్రఖ్యాతలు తెస్తాయన్నారు. వీరు పోలీసు శాఖకు అందించిన సేవలను గుర్తుంచుకుంటుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, ఎఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్బీఈ ఇన్‌స్పెక్టర్ దాదిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ వీరేశ్, శివరాముడు, డీపీఏవో జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు దిగిన పారిశుధ్య సిబ్బంది



పారిశుధ్య సిబ్బందితో చర్చిస్తున్న వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీను

వేంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో పారిశుధ్య సిబ్బంది సమ్మెకు దిగారు. ముందే ప్రకటించిన విధంగా బుధవారం వేకువజామునే విధులకు వెళ్లాల్సిన 70 మంది పారిశుధ్య సిబ్బంది పనులకు వెళ్లకుండా సమ్మె చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచు ఆర్.శ్రీను హుటాహుటిన పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పారిశుధ్య సిబ్బందిని పిలిపించారు. ఒక ట్రెండు రోజుల్లో ఈవో వస్తాడు, వచ్చిన వెంటనే పూర్తిగా వేతనాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో 9.30గంటల ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది తాత్కాలికంగా సమ్మెను విరమించారు.

ఉచిత కోచింగ్ ఒక వరం : డీఈవో

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ అభ్యర్థులకు వరం లాంటిదని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ అన్నారు. బుధవారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జరుగుతున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు వచ్చిన ఆయన అభ్యర్థులకు సైకాలజీ తరగతి బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్తున్న యూటీఎఫ్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నవతరం ప్రభుత్వ ఉపాధ్యాయులను తయారు చేయాలనే సంకల్పంతో కోచింగ్‌ను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఎస్సీ బోధకులు మస్తాన్, జిల్లా కార్యదర్శి సీవీ రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు చర్యలు : జడ్పీ చైర్మన్

కడప రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్తు కార్యాలయం ఆవరణలో ఉంటున్న నిరాశ్రయుల వసతి గృహంలో మౌలిక వసతుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామని జడ్పీ చైర్మన్ రామ గోవిందరెడ్డి హామీ ఇచ్చారు. నిరాశ్రయుల వసతి గృహం నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి బుధవారం జడ్పీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలు, అభాగ్యులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. నిరాశ్రయుల వసతి గృహానికి మరో రెండేళ్ల పాటు అవసరమైన వసతులను కల్పిస్తానన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, లైట్లు వితరణ

చెన్నూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రంపాడు పంచాయతీలో ఉన్న నాలుగు అంగన్వాడీ కేంద్రాలకు ఆ గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, మాజీ ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఫ్యాన్లు, లైట్లు అందించారు. ఈవోఆర్‌డీ సురేశ్‌బాబుకు స్థానిక గ్రామ సచివాలయంలో ఈ వస్తువులను అందించడం జరిగింది. అలాగే అందించిన ఫ్యాన్లు, లైట్లను ఈవోఆర్డీ అంగన్వాడీ కార్యకర్తలకు అందించారు.

ఉచితంగా పాదరక్షలు, గొడుగుల పంపిణీ

వేంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా వేంపల్లె మహిళా విభాగం, శ్రీలక్ష్మి మ్యూజిక్ బృందం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, ఉచితంగా పాదరక్షలు, గొడుగులను పంపిణీ చేశారు. వేంపల్లె మెయిన్ బజార్‌కు చెందిన రాజేష్, హేమలత కుమార్తె కావ్య జ్ఞాపకార్థం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, పుల్లగూర సుప్రజ, సభ్యులు, మ్యూజిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి కౌన్సిలరు కలిసి పనిచేసి నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని చైర్‌పర్సన్ మార్పురి మేరీ తెలిపారు. బుధవారం సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ముందుగా అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, అదేవిధంగా పారిశుధ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్, అధికారులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కడప కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రెండో గాంధీ బొమ్మ సమీపంలో ఉన్న చాంద్‌గిరి గుమ్మస్ ఉరుసు ఉత్సవాలు ఈనెల 14 నుండి ప్రారంభం కానున్న సందర్భంగా బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు ఉత్సవాల జెండాను ఎగురవేశారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్డు ఆక్రమణలు తొలగించాలి

చెన్నూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీ ప్రధాన కాల్వ, ఉప కాల్వకు ఇరువైపులా ఉన్న ఆయకట్టు రోడ్లలో ఎలాంటి ఆక్రమణలున్నా వెంటనే తొలగించాలని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన చెన్నూరులో మాట్లాడుతూ కేసీ ఆయకట్టు రోడ్డును కొన్నిచోట్ల రైతులు ఆక్రమించుకుంటే, మరి కొన్నిచోట్ల వాటిలో నిర్మాణాలు చేపట్టారన్నారు. దీంతో పంటల కోతల సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీ అధికారులు ఈ విషయమై సర్వే చేసి కేసీ ఆయకట్టు రోడ్డు ఆక్రమణలు తొలగించాలన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక అంశాలపై బాలికలకు అవగాహన కల్పించడంతో పాటు విద్య, నైపుణ్యం, సమాజంలో రాణింపు, జీవితంలో ఎదుగుదల వంటి అంశాలపై దిశ నిర్దేశం చేయనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో అరుణకుమారి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు ఎన్.ఈశ్వరమ్మ, బి.కళావతి, కె.రఫియా బాను అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి కమిటీ ఏర్పాటు చేసేలా దిశ నిర్దేశం చేశారు. కిశోరి బాలికల జాబితాను సేకరించి ఈ నెల 2 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక కార్యక్రమాలకు వారిని సిద్ధం చేయాలని సూచించారు. 15-18 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలికలు వేసవి సెలవుల సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు.

ఉగ్ర దాడి పిరికిపంద చర్య

- జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి

జమ్మలమడుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులు అమాయకులను దాడి చేసి చంపడం పిరికిపంద చర్య అని, ఇప్పటికైనా నీచబుద్ధిని మానుకోవాలని జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి, కౌన్సిలర్ ముల్లాజానీ హెచ్చరించారు. జమ్మలమడుగులో బుధవారం తాడిపత్రి రోడ్డు నందు ప్రధాన రోడ్డు పక్కన దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి వారి జెండాలను దహనం చేశారు. భారతదేశంలో హిందూ, ముస్లింలు ఐక్యతతో సోదరభావంతో ఉండడం పాకిస్తాన్ ఉగ్రవాదులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఎక్కడైనా అమాయక ప్రజలపై దాడి చేసి చంపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

గోపవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రూరల్ సీఐ నాగభూషణ్ తెలిపారు. మండలంలోని పీపీకుంట వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లైసెన్సు ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

వైభవంగా పునఃప్రతిష్ఠ మహోత్సవం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాజుపాలెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పునఃప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గోపాయపల్లె గ్రామంలో నిర్మించిన నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. రామేశ్వరస్వామి, పార్వతీ పరమేశ్వరుల గణపతి నాగదేవతల ధ్వజశిఖర నవగ్రహ, చౌడేశ్వరిదేవి పరివారమూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రాతఃకాల పూజ, యంత్రాభిషేకం, దేవతామూర్తుల అభిషేకం, గర్భమందిర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక ఆసనంపై కూర్చుండబెట్టి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కడప జడ్పీ చైర్మన్ గోవిందరెడ్డి,మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

మహిళలు స్వయంశక్తితో ముందుకెళ్లాలి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఆది

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంశక్తితో ముందుకెళ్లాలని, అందుకు పూర్తి సహకారం ప్రభుత్వం అందిస్తుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎర్రగుంట్లలో 280 మందికి ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రంలో మహిళలు 90రోజులు శిక్షణ పొందితే మంచి భవిషత్తు ఉంటుందన్నారు. గ్రూపుగా ఏర్పడితే రూ.10లక్షల రుణాన్ని 35శాతం సబ్సీడీతో పీఎంఈజీపీ కింద మంజూరు చేస్తారన్నారు. ప్రతి మహిళ రోజుకు రూ.500 నుంచి ఎంతైనా సంపాదించే అవకాశముందన్నారు. గతంలో తమ ట్రస్టు కింద కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. ఇప్పుడు కూడా తమ ట్రస్టు ఆధ్వర్యంలో మరో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఎన్టీఆర్ కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి ప్రారంభిస్తామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని కోరారు. శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి, ఎన్‌డీఏ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన ఫర్నీచర్స్ భవనం



పెచ్చులూడిన భవనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం శివాలయం రోడ్డులోని పాత బీవీఎస్ సినిమా హాలు ముందు వున్న శ్రీవెంకటేశ్వర ఫర్నీచర్స్ మూడు అంతస్తుల భవనం నుంచి బుధవారం పెచ్చులూడి రోడ్డు మీద పడ్డాయి. ఆ భవనం కింద ప్లాట్‌ఫ్లామ్ వ్యాపారం చేసుకుంటున్న వారిపై పడ్డాయి. కానీ తృటిలో ప్రమాదం నుంచి వ్యాపారులు తప్పించుకున్నారు. అంతేకాకుండా పాత ఎలివేషన్ గోడలు సైతం కూలాయి. మున్సిపల్ అధికారులు ఇలాంటి పాత భవనాలకు నోటీసులు ఇచ్చి వాటిని కూల్చకపోతే ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు.

పదవీ విరమణ.. హర్షించదగ్గ విషయం

బి.కోడూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు కష్టకాలంలో ప్రతి చెరువుగుండా సాగునీరు అందిస్తూ ఏ చెరువు కింద రైతులు ఏ పైరు వేశారో ఆ పైరుకు తగినంత నీటిని వారికి అందిస్తూ రైతుల మన్ననలు పొంది పదవీ విరమణ పొందుతున్న దేవదానం కృషిఫలుడని ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం లోయర్ సగిలేరు ప్రాజెక్టు పరిధిలోని అన్ని చెరువులకు సంబంధించిన లష్కర్ మేరుగ దేవదానం 35 ఏళ్లు రైతులకు ఎన్నో సేవలందించి పదవీ విరమణ పొందిన ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ కొండారెడ్డి, ముస్నెల్లి నీటి సంఘం అధ్యక్షుడు తిప్పలూరు రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, బాలిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాటల ద్వారా విజ్ఞానం : జేవీవీ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాటల ద్వారా విజ్ఞానం పొందవచ్చని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు దేవదత్తం తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆఫ్రిద్ పర్యవేక్షణలో జనవిజ్ఞానవేదిక సహకారంతో నిర్వహిస్తున్న వేసవి వినోద కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయం ద్వారా విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదావీర్ సహాయ సహకారాలతో కథలు చెప్పడం, పాటలు నేర్పించడం, ఆటలు ఆడడం, డ్రాయింగ్ నేర్పించుట తదితర అంశాల ద్వారా పిల్లలతో విజ్ఞానం పెంపొందించుటకు ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ మహ్మద్‌రఫి, సతీష్‌బాష, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు లోన్లు రావాలంటే ముడుపులు అడుగుతున్న యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొంత మంది యానిమేటర్లు తాము నచ్చిన వారికి లోన్లు రాయిస్తూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో పోరుమామిళ్ల మండలం వెలుగు కార్యాలయంలో రూ.40 లక్షలు దుర్వినియోగం చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవని, స్థానికేతరులను ఇక్కడ యానిమేటర్లుగా నియమించడం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. మండలంలో యానిమేటర్లపై విచారణ జరిపి డ్వాక్రా సంఘాల అభివృద్ధికి జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు రోడ్డులోని నదిరుల్లాషా సాహెబ్ దర్గా స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దర్గా డీఫోటిస్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ అహమ్మద్, కార్యదర్శి షేక్ సలీంబాషలు పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దర్గా స్థలంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో రిట్ పిటీషన్ వేయగా ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు తీర్పు వచ్చే వరకు దర్గా స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయితే హైకోర్టు తీర్పును ధిక్కరించి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కమిటీ కోశాధికారి షేక్ అబ్దుల్ ఖాదర్, సభ్యులు పాల్గొన్నారు.

ఉరుసును విజయవంతం చేయాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పలగాడి వీధిలో పెద్ద ఆస్తానముల వారి (బడేగౌస్‌పీరా ఖాద్రి) 93వ ఉరుసు మహోత్సవ కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆస్తాన-యే గౌషియా దర్గా పీఠాధిపతి సయ్యద్ గౌస్ పీరా ఖాద్రి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో గౌషియా యువ పీఠాధిపతి తాహీర్‌పీరాఖాద్రి పాల్గొన్నారు.

నేడు అన్నదానం

కొండాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో వెలసిన కాశిరెడ్డినాయన ఆలయ రెండవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అన్నదానం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని గణపతి, అన్నపూర్ణదేవి, కాశిరెడ్డినాయన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి కోలాటం, మధ్యాహ్నం అన్నదానం, అనంతరం తాళాల భజన ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

'షర్మిల అరెస్టు అన్యాయం'

చాపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ షర్మిలను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రామసుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉద్దండ రాయునిపాళెంలో షర్మిళారెడ్డి పర్యటనను బుధవారం అడ్డుకొని గృహ నిర్బంధం చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఇలాంటి పనులు మానుకోవాలని హితవు పలికారు.

కుట్టు మిషన్లపై శిక్షణ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లపై శిక్షణ కార్యక్రమాన్ని పోరుమామిళ్లలోని రైతుభరోసా కేంద్రంలో ప్రారంభించారు. బుధవారం మొదటిరోజు రెండు బ్యాచ్‌లుగా 140 మందితో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్ కార్తీక్ కార్యక్రమాన్ని నిర్వహించగా, రమాదేవి శిక్షణకు వచ్చిన మహిళలకు మెళకువల గురించి తెలిపారు.

కిశోర బాలికలు శుభ్రత పాటించాలి

చాపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు (15-18 ఏళ్ల లోపు) వయస్సు ఉన్నవారు శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్న అన్నారు. భద్రిపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో బుధవారం కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన ఆమె కల్పించారు. విటమిన్లతో కూడిన బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్సవాలపై నేడు సమావేశం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 4 నుంచి 10వ తేది వరకు గురుపూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు మండల స్థాయి అన్ని శాఖల అధికారులచే సమావేశానికి హాజరుకావాలని బి.మఠం ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరకిశోర్ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతులు

అట్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రంథాలయం నందు వేసవిలో విద్యార్థులకు విజ్ఞాన తరగతులు నిర్వహించామని గ్రంథాలయ అధికారి సుధాకర్ తెలిపారు. బుధవారం దాదాపు 30 మంది పిల్లలకు విద్యార్థులచే నీతి వ్యాఖ్యాలు, వేమన పద్యాలు, వివిధ రకాల బోధనలు చదివించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తుల ద్వారా లైబ్రరీలో పుస్తక పఠనం నిర్వహించారు.

మంత్రిని కలిసిన ఆర్యవైశ్య డైరెక్టరు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ శాఖమంత్రి సవితమ్మను బుధవారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డెవలప్‌మెంటు డైరెక్టరు వెంకటసుబ్బయ్య కలిశారు. విజయవాడ సెక్రటేరియట్‌లో మంత్రి ఛాంబరులో పూలబొకే అందించి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఎమినిటీస్ కార్యదర్శి బదిలీ

కలికిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఎమినిటీస్ కార్యదర్శిగా (గ్రేడ్-2) వై.అఖిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా డోన్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న అఖిలను భార్యాభర్తల (స్పౌజ్) కేటగిరీ కింద పరిగణించి ఆమె విన్నపం మేరకు ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. అయితే ఆమె సర్వీసు విషయంలో మాత్రం జిల్లా సీనియారిటీ జాబితాలో చివరగా వుండాల్సి వుంటుందని నిబంధన విధించారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రొద్దుటూరుటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగిందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. పరీక్ష కోసం సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌కేఎస్ఈ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించారు. 4320 మంది అభ్యర్థులకు గానూ 3962 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 358 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. 91.7 శాతం విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని మైలవరం జలాశయ డీఈఈ నరసింహమూర్తి బుధవారం తెలిపారు. జలాశయం నుంచి పెన్నానదికి 200 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 60 క్యూసెక్కులు నీరు విడుదల కొనసాగుతోందని ఆయన తెలిపారు. జలాశయం పూర్తి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలకు గానూ ప్రస్తుతం మైలవరం జలాశయంలో 3.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈఈ తెలిపారు.

జగన్, అవినాష్‌రెడ్డి దోపిడీ

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి జిల్లాను, జమ్మలమడుగును దోపిడీ చేయడం తప్ప అభివృద్ధి మాటే లేదని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించారు. బుధవారం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారిద్దరూ జమ్మలమడుగు అభివృద్ధిపై ఏరోజైనా మాట్లాడి ఉంటే రావాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూడాలని, ప్రభుత్వ వసతిగృహాలు, ఆస్పత్రి, రోడ్లు, అనేక చోట్ల సమస్యలు పరిష్కరించానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్ బానా శివరామలింగారెడ్డి, పెద్దదండ్లూరు రమేష్‌రెడ్డి, తవ్వా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

- ఎంపీడీవో రామనాథరెడ్డి

గోపవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గోపవరం మండలంలో పింఛను లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో రామనాథరెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపవరంమండలంలో 2583 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి రూ.1,09,38,500 పంపిణీ చేస్తామన్నారు. అదే విధంగా బద్వేలు మండలంలో 3155 మందికి రూ.1,32,73,000 సొమ్మును పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులకు బుధవారం నగదు విత్‌డ్రా చేసి ఇవ్వడం జరిగిందని గురువారం ఉదయం నుండే పింఛనుదారుల ఇంటి వద్దనే సచివాలయ ఉద్యోగులు పింఛను ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె : యూటీఎఫ్



ఓబుల్‌రెడ్డి సేవలను కొనియాడుతున్న దృశ్యం

బద్వేలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఆ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి సింగన ఓబుల్‌రెడ్డి అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో గోపవరం ఎంఈవో రఘురామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన సభలో వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజాలు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ

చాపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు చాపాడు పశువైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఏడు టన్నుల దాణా మంజూరు చేసిందని, 50 శాతం సబ్సిడీ పోనూ ఒక్కో బ్యాగు రూ.550కు విక్రయిస్తున్నామన్నారు. చాపాడు, చిన్నగురవలూరు గ్రామాల్లో ఉన్న ఆర్‌బీకేలకు 2.5 టన్నులు, వెదురూరు ఆర్‌బీకేకి 2 టన్నుల దాణా ఇస్తున్నామన్నారు.

కాలుష్య కోరల్లో రాయలసీమ వాసులు

- ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు కుంచెం

జమ్మలమడుగు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని సిమెంటు ఫ్యాక్టరీల వారు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని, దుమ్ము కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిమెంటు ఫ్యాక్టరీల వలన ఇబ్బంది పడుతున్న ప్రజల కష్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. అనంతరం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

నేడు ఫిజియోథెరపీపై అవగాహన

కొండాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ సిబ్బందికి గురువారం ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన నిమ్స్ ఫిజియోథెరపీ వైద్యబృందంచే ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది తప్పక పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

వైభవంగా శ్రీరామ కల్యాణం

దువ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని రామాలయంలో బుధవారం శ్రీరాముని కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ ద్విదశాబ్ది వార్షికోత్సవాల సందర్భంగా కార్యక్రమం భక్తుల మధ్య జరిగింది. కార్యక్రమాలను పాశం లక్ష్మీనరసయ్య, పాపినేని మహాలక్ష్మి, వీరి కుటుంబీకులు పర్యవేక్షించారు.